క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, అభిషేకాలు, కుంకుమార్చన, బండారార్చన, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. మూలమూర్తులకు వెండితొడుగులు తొడిగి, ఆకులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

టెంకాయల విక్రయానికి వేలం



ములుగుందంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా టెంకాయల విక్రయ హక్కుల వేలం నిర్వహించారు. ఆదివారం ములుగుందం దస్తగిరి స్వామి దర్గాలో గ్రామస్తుల సమక్షంలో చేపట్టిన వేలంలో నలుగురు పాటాదారులు పాల్గొనగా అదే గ్రామానికి చెందిన దస్తగిరి రూ.1.70 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 2లక్షలకు పోగా, ఈసారి రూ.1.70 లక్షలకే పలికింది. దీంతో దర్గాకు రూ. 30వేల ఆదాయం తగ్గింది.

ముగిసిన ఉరుసు



షంషేర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని చెన్నంపల్లి పురాతన కోటలో కొలువైన శవాసప్ప స్వామి దర్గా ఉరుసు ముగిసింది. ఆదివారం వేకువజామున స్వామి షంషేర్‌ను గుర్రంపై ఉంచి మేళతాళాలతో నిర్వాహకులు గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి తమ కోర్కెలు నెరవేర్చాలని వేడుకున్నారు.

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

దేవనకొండ: కార్మికవర్గమంతా ఐక్యంగా సమస్యలపై ఉద్యమించడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, ఐక్య పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు పి.ఎస్. రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్ అన్నారు. ఆదివారం దేవనకొండలో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అంజి, వెంకటేశ్, తిప్పన్న, గోపాల్, పాండు, విశ్వనాథ్, గోపాల్, సుధాకర్, రవీంద్ర, సుభాన్ పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



పోతుగల్లులో ఇంటింటికీ కుళాయి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: గ్రామంలో నూతన కాలనీ వాసులకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, సర్పంచ్ తెలుగు వాణీశ్రీ తెలిపారు. మండలంలోని పోతుగల్లు గ్రామంలోని నూతన కాలనీలో గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయి పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి గ్రామ సమీపంలోని గజ్జహళ్లి- పెద్దహరివాణం క్రాస్ రోడ్డు మధ్యలో ఆదివారం ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కలోని గుంతలోకి దూసుకుపోయిన ఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. మార్లమడికి గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ హరివాణం వెళ్తుండగా.. ఎదురుగా వేగంగా వస్తున్న బైక్‌కు సైడ్ ఇచ్చే సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంతో ట్రాక్టర్‌ను నిలిపి వేయడంతో గుంతలోకి ఒరిగి నిలిచి పోయింది.

కక్షపూరిత రాజకీయాలతోనే హత్యలు

హొళగుంద: రాష్ట్రంలో కక్షపూరిత వాతావరణం నెలకొందని, దీంతో హత్యలు, దాడులు అధికమయ్యాయని ఎస్డీపీఐ ఆలూరు నియోజకవర్గ అధ్యక్షుడు, కార్యదర్శి హమీద్, సుభాన్ అన్నారు. ఆదివారం ఈరన్న కుటుంబాన్ని పరామర్శించారు. కేవలం రూ.12 వేలు జీతం వచ్చే ఫీల్డ్‌అసిస్టెంట్ ఉద్యోగం కోసం ఈరన్నను కిరాతకంగా హత్య చేయడం దారుణమన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీ వరించడంపై హర్షం

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం వరించడంపై ఎమ్మార్పీస్ ఆలూరు తాలూకా మాజీ అధ్యక్షుడు చిన్నహ్యాట శేషగిరి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం అవిశ్రాంతంగా పోరాడారని కొనియాడారు.



వెల్దుర్తిలోని బాపూజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఆస్పరిలో జెండాకు వందనం చేస్తున్న డీటీ రామేశ్వరరెడ్డి



జాతీయ నాయకులు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు



వెల్దుర్తిలో జెండావిష్కరణ చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర వర్మ



కృష్ణగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న దృశ్యం

ఘనంగా గణతంత్ర వేడుకలు

- ముువ్వన్నెల జెండా రెపరెపలు

వెల్దుర్తి: గణతంత్ర దినోత్సవాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర వర్మ తన కార్యాలయంలో పోలీసు కవాతు మధ్య జాతీయ జెండావిష్కరణ చేశారు. ఎంపీడీఓ సుహాసిని, ఎంపీపీ రంగన్న, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న ఎంపీడీఓ కార్యాలయంలో, సీఐ మధుసూదన్ రావు, సీడీపీఓ ల్యూక్, ఎస్ఐ అశోక్, మేజర్ పంచాయతీ ఈఓ లక్ష్మీనాథ్, ఇతర అధికారులు తమ తమ కార్యాలయాల ఎదుట గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు సుమాంజలి ఘటించి జాతీయ పతాకావిష్కరణ గావించారు. రిపబ్లిక్ డే విశిష్టత, రాజ్యాంగ నిర్మాణ పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాలీలు ఆకట్టుకున్నాయి.వైఎస్సార్‌సీపీ పత్తికొండ నియోజకవర్గ ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దాదిపోగు నవీన్‌మాదిగ పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ఆస్పరి: మండలంలో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సచివాలయం దగ్గర సర్పంచ్ మూలింటి రాధమ్మ, రెవెన్యూ కార్యాలయం వద్ద డీటీ రామేశ్వరరెడ్డి, మండల పరిషత్ కార్యాలయం దగ్గర ఎంపీడీఓ గీతావాణి, ఎంపీపీ సుంకుర ఉమాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, పోలీస్ స్టేషన్ అవరణలో సీఐ మస్తాన్‌వలి, ఎస్ఐ నరసింహులు, సొసైటీ కార్యాలయంలో సీఈఓ నరసింహులు జాతీయ జెండాను అవిష్కరించారు.

మద్దికెర : తహసీల్దార్ హుసేన్ సాహెబ్ జాతీయజెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ విశిష్టతను వివరించారు.స్థానిక ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారుల నృత్యాలు, వేషధారణలు అలరించాయి. జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచులు బండారు సుహాసిని, మల్లికార్జున, విజయుడు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

తుగ్గలి : గణతంత్ర వేడుకల్లో భాగంగా మండలంలోని పీ.కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు జాతీయ సమైక్యతను చాటాయి. ముందుగా పాఠశాల హెచ్ఎం నాగేశ్వరమ్మ, పీఎంసీ చైర్మన్ రంగనాయకులు జాతీయజెండాను ఆవిష్కరించారు. జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రదర్శనలకు ఎంఈవో రమా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లి దండ్రులు ముగ్ధులయ్యారు. గ్రామ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చక్రపాణి, శివరాముడును శాలువాలతో సన్మానించారు.బీపీఎం రామాంజనేయులు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి.



ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఆర్డీఓ ఎస్.భరత్‌నాయక్

- స్వాతంత్ర్యం కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని, వారి బాటలో నడవాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విశ్వమోహన్, పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ పులిశేఖర్, ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయా శాఖల అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్ : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాను ఎగురవేసి ఆదివారం ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ శ్రీవల్లి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఎస్.భరత్‌నాయక్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకట్రామయ్య, సర్కిల్ కార్యాలయంలో రూరల్ సీఐ పులిశేఖర్, పత్తికొండ పోలీసు స్టేషన్‌లో అర్బన్ సీఐ జయన్న, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణదాస్, ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెంట్ డాక్టర్ కల్పన జాతీయ జెండాను ఎగురవేశారు.

కృష్ణగిరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ, ఉపాధి కార్యాలయం వద్ద ఎంపీడీఓ మోహన్ కుమార్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మల్లికార్జున, సచివాలయాల వద్ద పంచాయతీ కార్యదర్శులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి ప్రదీప్, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఏఈ మద్దిలేటి, ఎమ్మార్సీ వద్ద ఎంఈఓలు సునంధ, మద్దయ్య, హాస్టళ్ల వద్ద వార్డెన్‌లు వెంకటేశ్వర్లు, శంకర్, అలాగే విద్యాలయాల్లో హెచ్ఎంలు జెండా అవిష్కరించారు.

హొళగుంద: తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాలు, ఎంఆర్సీ, పోలీస్‌స్టేషన్, సింగిల్ విండో, అగ్రికల్చర్, హొళగుంద, గజ్జహళ్లి పిహెచ్‌సీలు, గ్రంథాలయం, ఆయా గ్రామాల సచివాలయాలు, సీజనల్ హాస్టల్ ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ముందు జెండావిష్కరణ గావించారు. ఎస్ఐ బాల నరసింహులు, ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్, ఎంపీపీ తంబాకు నూర్జహన్, ఎంపీడీఓ విజయలలిత, ఈఓపీఆర్డీ చక్రవర్తి, సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, సింగిల్ విండో సెక్రటరి నీలకంఠస్వామి, ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం, సీహెచ్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చిప్పగిరి: స్థానిక గ్రామ సచివాలయం, జెడ్పీహెచ్ హైస్కూల్.కేజీబీవీ పాఠశాలలో లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను వివరించారు. తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్,ఎస్ఓ సౌజన్య, సర్పంచ్ గోవిందరాజులు,ఎంపీటీసీ రజినీ,పంచాయతీ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని చాటుదాం

ఆలూరు రూరల్: రాజ్యాంగ స్ఫూర్తిని చాటేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమ అన్నారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణలో ఆమె జాతీయ జెండాను అవిష్కరించారు. భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గోవింద్ సింగ్ త్రివర్ణ పతాకాన్ని అవిష్కరించారు. పోలీసు సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటచలపతి, ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈఓ ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



ఆలూరు జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న జడ్జి హేమ



హొళగుంద సచివాలయం-4 ముందు జాతీయ జెండాను ఎగురవేస్తున్న పంచాయతీ సెక్రటరీ



హాలహర్వి ప్రభుత్వ ఆసుపత్రిలో వేడుకల్లో పాల్గొన్న వైద్య సిబ్బంది



పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ మెజిస్ట్రేట్ శ్రీవల్లి



ఆస్పరిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సీఐ మస్తాన్‌వలి



మద్దికెరలో దేశభక్తుల వేషధారణలో చిన్నారులు



కంబాలపాడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల విన్యాసాలు



గాంధీ వేషధారణలో విద్యార్థి ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో, హెచ్ఎం



మద్దికెరలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న తహసీల్దార్



హొళగుంద తహసీల్దారు కార్యాలయం జెండావందనం చేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్



తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో జెండావందనం చేస్తున్న రూరల్ సీఐ, ఎస్ఐ



కృష్ణగిరిలో జెండా అవిష్కరిస్తున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న బీట్ ఆఫీసర్ శకుంతలమ్మ, పీఎస్ అజీజ్‌బాషా,ఏపీఎం నాగార్జున

ఉత్తమ సేవలకు పురస్కారం

వెల్దుర్తి: రామళ్లకోట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శకుంతలమ్మ ఉత్తమ బీట్ ఆఫీసర్‌గా ఆదివారం ప్రశంస అందుకున్నారు. గణతంత్ర దినోత్సవాన కర్నూలులో జరిగిన పేరెడ్‌లో కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. అలాగే.. హాలహర్వి మండలం బాపురం పంచాయతీ కార్యదర్శి అజీజ్‌బాషా, చిప్పగిరి మండలంలో వెలుగు ఏపీఎం నాగార్జున కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. వెల్దురి మండలజలోని ఎల్ నగరం వీఆర్ఓ కృష్ణమూర్తి రాష్ట్రస్థాయి ఉత్తమ బీఎల్ఓ అవార్డు అందుకున్నాడు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ నుంచి అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.



విజయవాడలో చీఫ్ సెక్రటరీ నుంచి అవార్డు అందుకుంటున్న వీఆర్ఓ కృష్ణమూర్తి

పార్లమెంట్‌లో కనీస మద్దతు ధర చట్టం చేయాలి

పత్తికొండ రూరల్ : రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సంయుక్త కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆదివారం స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఏఐటీయుసీ తాలూకా అధ్యక్షుడు నెట్టికంటయ్య అధ్యక్షతన ఆందోళన చేపట్టారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏఐటీయుసీ ఎం.రంగన్న, సీఐటీయు కాశీనాథ్, రైతు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు సురేంద్ర, సిద్దయ్యగౌడు, రంగారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈరన్న కుటుంబానికి పరామర్శ

ఆలూరు/ ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామంలో హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆదివారం పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ. 50 వేల చెక్కును అందజేశారు. మృతుడి భార్యకు గ్రామంలో అంగన్‌వాడీ ఆయా ఉద్యోగం ఇప్పించడంతో పాటు ఇద్దరు పిల్లల చదువుల బాధ్యత పూర్తిగా తానే తీసుకుంటానని భరోసానిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈరన్న హత్యపై పోలీసు విచారణ జరుగుతుందని, విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు..ఈరన్నను హత్య చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు పర్ల శ్రీనివాసులు, జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరాముడు, ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జయరాం పాల్గొన్నారు.



ఈరన్న భార్య నాగలక్ష్మికి రూ.50 వేల చెక్కు అందిస్తున్న ఎంపీ నాగరాజు

కురుబలను కించపరిస్తే ఊరుకోం

ఆలూరు: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బి.వీరభద్రగౌడు, ఆయన తయుడు గిరిమల్లేష్‌గౌడు కురుబ కులస్తులను కించపరిచేలా మాట్లాడితే ఊరుకోబోమని కురుబ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గుడిసె శివన్న ,జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి దేవేంద్ర, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాం ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

హక్కుల సాధనకు ఐక్యత అవసరం

మాదిగ ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్యతతో పోరాడాల్సిన అవసరం ఉందని జిల్లా మాదిగ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నియోజకవర్గ సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి రాజన్న ఆధ్వర్యంలో ఆదివారం వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మాదిగ ఉద్యోగులతో సమావేశమయ్యారు. మందకృష్ణకు పద్మశ్రీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బసవరాజ్, కార్యదర్శిగా శాంతప్ప, కోశాధికారిగా రాజన్న తదితరులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు టీ షర్ట్‌ల పంపిణీ

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9,10 తరగతులు చదువుతూ కబడ్డీలో రాణిస్తున్న విద్యార్థులకు ఆదివారం సర్పంచ్ ఆరుబట్ల నాగమ్మతో పాటు గ్రామపెద్దలు గిరిమల్ల, బాబుసాహెబ్, పెద్దయర్రిస్వామి ఉచితంగా టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్, ప్రైమరీ పాఠశాలల పీఎంసీ చైర్మన్‌లు కురువ శేషప్ప, జంగమ అనిల్‌స్వామి, హెచ్ఎంలు, పీఈటీల చేతుల మీదుగా టీషర్ట్‌లను విద్యార్థులకు అందజేశారు.



కృష్ణగిరి సమీపంలో బిందు సేద్యం ద్వారా పంటను తడుపుతున్న దృశ్యం



బాపనదొడ్డి సమీపంలో స్ప్రింక్లర్లతో పంటకు నీటి తడులు

‘బిందు’వుతో సాగు!

కృష్ణగిరి: కరువు నేలలో పంటల సాగు అంత సులభం కాదు. అయినప్పటికీ ఇక్కడి రైతులు చెమటోడ్చి.. ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకుని సిరులు పండిస్తున్నారు. ముఖ్యంగా గరప నేలల్లో భూగర్భ జలాలు అంత త్వరగా లభించవు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో పదుల సంఖ్యలో బోర్లు తవ్వించి నీటి కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. చివరికి చిక్కిన నీటి బిందువును జాగ్రత్తగా వాడుకునేందుకు బిందు సేద్యాన్ని అనుసరిస్తున్నారు. ఈ పద్ధతిలో బోర్లలో నీటి లభ్యత తక్కువగా ఉన్నా పంట సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. మామూలుగా అయితే బోర్లలో అధికంగా నీరు పడితేనే గతంలో పంటల సాగుకు అన్నదాతలు ముందుకొచ్చేవారు. ఈ పథకం వచ్చిన తర్వాత బోర్లలో ఊట కొద్దిగా ఉన్నప్పటికీ ఆ నీటితోనే పంట సాగుచేసుకునే అవకాశం కలిగింది. జగనన్న హయాంలో రైతులను ప్రోత్సహించేందుకు భారీగా పరికరాలను సబ్సిడీపై అందించారు. దీంతో గ్రామాల్లో ఇప్పుడు ప్రతి రైతు బిందు సేద్యం వైపు మొగ్గుచూపుతున్నారు. ఏ గ్రామమెళ్లినా, ఏ పొలాల్లో చూసిన మైక్రో స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకుని పంటలను తడుపుకుంటున్నారు.